సాక్షి జగిత్యాల

గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో బుధవారం భక్తుల రద్దీ నెలకింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు పూజలు చేశారు.



మహాజాతరకు ముస్తాబు

వేములవాడ: శ్రీరాజరాజేశ్వరస్వామి మహాశివరాత్రి జాతరకు ముస్తాబు అవుతోంది. అధికారులు ఏర్పాట్లు వేగవంతం చేశారు.

గరిష్టం/కనిష్టం
33.0/16.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటినుంచి దుబ్బరాజన్న బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన స్వామివారు, అమ్మవారు

సారంగాపూర్(జగిత్యాల): జిల్లాలోనే అతిపెద్ద శైవక్షేత్రం శ్రీదుబ్బరాజన్న ఆలయం మహాశివరాత్రి, స్వామివారి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. గురువారం రాత్రి బ్రహ్మోత్సవాలు, వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈనెలాఖరు వరకు సాగుతాయి. ఇందుకోసం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



నేత్రపరీక్ష చేస్తున్న డాక్టర్ సంజయ్

జగిత్యాల: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సంజయ్‌కుమార్ కోరారు. బుధవారం జగిత్యాల నియోజకవర్గ పరిధిలోని సుమారు 25 మంది నిరుపేదలకు ఆపిరోటరీ క్లబ్, పావని కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా నేత్రశస్త్ర చికిత్సలను ఎమ్మెల్యే, డాక్టర్ సంజయ్ నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ, డాక్టర్ విజయ్, యూత్ అధ్యక్షుడు శేఖర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలల్లో బ్యాంకింగ్ అక్షరాస్యతా వారోత్సవాలు



కార్యక్రమంలో బ్యాంకర్లు, ప్రిన్సిపాల్

జగిత్యాల: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బ్యాంకింగ్ అక్షరాస్యత వారోత్సవా లను బుధవారం నిర్వహించారు. ఆర్‌బీఐ రీజినల్ అసిస్టెంట్ మేనేజర్ అనిల్‌కుమార్ మాట్లాడారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ బ్యాంకింగ్, సేవింగ్స్, డెబిట్స్, క్రెడిట్, లోన్స్, ఎడ్యుకేషన్ లోన్స్ తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.సత్యనారాయణ, బ్యాంక్ అధికారులు వెంకటరెడ్డి, జగిత్యాల లీడ్‌బ్యాంక్ మే నేజర్ మధుసూదన్, టీఎస్కేసీ కోఆర్డినేటర్ సత్యప్రకాశ్, జిల్లా నోడల్ అధికారి పడాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ఘనస్వాగతం.. సన్మానం

- నాచుపల్లి జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో సీఎం దిగగానే.. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు ఘనస్వాగతం పలికారు.
- బస్సు నుంచి దిగాక.. ప్రధాన ఆలయంలోకి ప్రధాన పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.
- అనంతరం ఆలయ పరిసరాలను సీఎం కలియ తిరిగారు. ప్రతీ నిర్మాణం గురించి వాస్తు నిపుణులను అడిగారు.
- ఇక ఆలయ మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించి మ్యాపులను స్వయంగా పరిశీలించారు. అందులోని పలు నిర్మాణాల విషయంలో సూచనలు చేశారు.
- దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సుంకెరవిశంకర్ ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించారు. కొండగట్టు ఆలయ చిత్రాన్ని బహూకరించారు.



సీఎం కేసీఆర్‌కు అంజన్న చిత్రపటం అందిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ఇక అంజనాద్రిగా కొండగట్టు

యాదాద్రి తరహాలో అభివృద్ధి, పునర్నిర్మాణం



అంజన్నకు మొక్కులు చెల్లించుకుని బయటకు వస్తున్న సీఎం కేసీఆర్

- ఆలయాభివృద్ధి ఖర్చుకు వెనకాడనన్న సీఎం
- పనులు పూర్తయ్యే వరకు వస్తూనే ఉంటా
- భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగవద్దు
- మాల విరమణ దీక్షాపరులకు ప్రత్యేక సదుపాయాలు
- కాటేజీల నిర్మాణానికి ముందుకు వచ్చిన మంత్రి గంగుల
- రెండుగంటలు ఆలయాభివృద్ధిపై ముఖ్యమంత్రి సమీక్ష

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కొండగట్టు: యాదాద్రి తరహాలో కొండగట్టు పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం కేసీఆర్ అన్నారు. బుధవారం కొండగట్టు ఆలయం అభివృద్ధి, విస్తరణ మాస్టర్‌ప్లాన్ తదితరాలపై నిర్వహించిన సుదీర్ఘ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని పలు సూచనలు చేశారు. ఉదయం 11 గంటల సమయంలో హెలీక్యాప్టర్‌లో కొండగట్టుకు వచ్చిన సీఎం.. జేఎన్టీయూ హెలీప్యాడ్ నుంచి నేరుగా బస్సులో నేరుగా ప్రధానాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- ఉదయం 11.25 నుంచి 12.05 గంటల వరకు జరిగిన పూజల్లో పాల్గొన్నారు.
- మ.12.15 గంటల నుంచి మ.2.20 నిమిషాల వరకు ఆలయం, పరిసరాల్లో భక్తుల కోసం కల్పించాల్సిన సౌకర్యాలపై పండితులు, వాస్తు, ఇంజినీరింగ్ నిపుణులు, మిషన్‌భగీరథ, అటవీ, పర్యాటక శాఖ, దేవాదాయ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.
- ఆలయ అభివృద్ధికి ఖర్చు విషయంలో వెనకాడేది లేదని, ఇప్పుడు విడుదల చేసిన రూ.100 కోట్లకు మరో రూ.1000 కోట్లయినా ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని సీఎం స్పష్టంచేశారు. ఆగమశాస్త్రం ప్రకారం.. వాస్తు నియమాలకు అనుగుణంగా యాదాద్రి తరహాలో అంజనాద్రిగా తీర్చిదిద్దడమే ధ్యేయమని స్పష్టం చేశారు.

క్యూలైన్లు విస్తరించాలి..

సమావేశం ప్రారంభంలోనే.. దేవాలయాన్ని భక్తుల అవసరాలకు అనుగుణంగా విస్తరించడానికి సేకరించాల్సిన భూములు, సంబంధించిన అంశాలపై లొకేషన్ మ్యాపులను సీఎం పరిశీలించారు. వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధిని చేపట్టనున్నట్లు స్పష్టంచేశారు. శని, మంగళవారాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు విస్తరించాలన్నారు.

- భక్తుల కోసం గుట్ట మీద కాటేజీల నిర్మాణానికి దాతలను ఆహ్వానించాలన్నారు. ఇప్పటికే శ్వేత గ్రానైట్స్ వారు నిర్మించిన కాటేజ్.. విస్తరణలో పోతున్నందున దాన్ని తిరిగి నిర్మిస్తామని మంత్రి గంగుల కమలాకర్ ముందుకు వచ్చారు. అందుకు తగిన స్థలాన్ని కేటాయించాలని కోరారు. మంత్రి చొరవను సీఎం అభినందించారు. కళ్యాణ కట్ట దగ్గర పుష్కరిణిలు ఏర్పాటు చేయాలన్నారు. కల్యాణ కట్ట పుష్కరిణి పక్కపక్కన ఉండటం తోపాటు స్త్రీలు, పురుషులకు ప్రత్యేక పుష్కరిణులు ఏర్పాటు చేయాలన్నారు. కొండగట్టులోని అటవీ సంపదను పరిరక్షించేలా బందీపూర్ అభయారణ్యం తరహాలో గుట్టపై అడవిని వృద్ధి చేయాలన్నారు. ఆలయ స్థల పురాణం పుస్తకాలను ముద్రించాలని, రాష్ట్రంలోని అన్ని ఆలయాల స్థల పురాణ పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో కొండపైకి వచ్చే వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఘాట్‌రోడ్డును విస్తరించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.
- సమీక్ష సమావేశంలో మంత్రులు, కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ దివకొండ దామోదర్ రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, బాల్క సుమన్, జీవన్ రెడ్డి, సంజయ్, కె.విద్యాసాగర్ రావు, కోరుకంటి చందర్, మండలి చీఫ్ విప్ భాను ప్రసాద రావు, ఎమ్మెల్సీ ఎల్.రమణ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్, కలెక్టర్ యాస్మిన్ భాషా, ఆలయ స్థపతి ఆనందర్ సాయి, వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ, ఆలయ ఈఓ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మీడియాకు, భక్తులకు నో ఎంట్రీ..!

సీఎం పర్యటన సందర్భంగా గుట్టపైన భద్రత కట్టుదిట్టం చేశారు. కేవలం కొండగట్టులో పనిచేసే దేవాదాయ, శానిటేషన్ సిబ్బంది మినహా గుట్టపై వ్యాపారులను సైతం అనుమతించలేదు. భక్తులకు గుట్ట మీదకు ప్రవేశం లేదన్న సంగతి తెలియక మధ్యాహ్న వరకు కిందనే ఇబ్బందులు పడ్డారు. చివరికి మీడియాకు సైతం ప్రవేశం లేకపోవడం గమనార్హం. మంగళవారం సాయంత్రమే గుట్టపై ఉన్న వారిని ఖాళీ చేయించారు. రాత్రి నుంచి గుట్టను పోలీసులు పూర్తిగా స్వాధీనంలోకి తీసుకున్నారు. ఎస్పీ భాస్కర్ నేతృత్వంలో దాదాపు 2,000 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఐజీ రమేశ్‌నాయుడు, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, మరో ఇద్దరు ఎస్పీలు, 20 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 150 మంది ఎస్సైలు ఇతర అధికారులు పాల్గొన్నారు. ముందు రోజు అర్ధరాత్రి వరకు సీఎం కార్యదర్శి స్మితాసబర్వాల్, కలెక్టర్ యాస్మిన్ భాషా కొండపై సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

అంజన్న ఆలయ అభివృద్ధే ముఖ్యమంత్రి ధ్యేయం

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



సుంకె రవిశంకర్

కొండగట్టుకు సీఎం కేసీఆర్ వచ్చి వెళ్లడం చాలా సంతోషమని.. సూర్యచంద్రులు ఉన్నంత వరకు చంద్రశేఖరుడుంటాడని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. 600 నుంచి వెయ్యి కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కొండగట్టు ఆలయాన్ని చరిత్రలో నిలిచిపోయేలా చేయడం ఆనందంగా ఉందన్నారు. పదిరోజుల్లో కరీంనగర్ వచ్చి ఆలయానికి మరోసారి కేసీఆర్ రానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సీఎం సారొచ్చారని..

- భక్తులకు కొండపైకి అనుమతి ఇవ్వని అధికారులు
- దిగువ కొండగట్టులో హనుమాన్ విగ్రహానికి మొక్కులు

ముఖ్యమంత్రి కేసీఆర్ కొండగట్టు పర్యటన సందర్భంగా పోలీసుల, అధికారుల ఆంక్షలతో సాధారణ భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. బుధవారం ఉదయం నుంచే పోలీసులు కొండగట్టును మొత్తం తమ ఆధీనంలోకి తీసుకోగా.. కొండపైకి ఇతరులను, భక్తులను అనుమతించలేదు. దిగువ కొండగట్టులో బారీకేడ్లు ఏర్పాటు చేసి కొండపైకి వెళ్లేవారిని అడ్డుకున్నారు. సీఎం పర్యటన విషయం తెలియక అంజన్న దర్శనానికి కొండగట్టు వచ్చిన భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్నపిల్లలు ఎండకు అలమటించారు. అంజన్న దర్శనానికి అవకాశం లేకపోవడంతో దిగువ కొండగట్టు బస్టాండు వద్ద ఉన్న హనుమాన్ విగ్రహానికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించి.. వెనుదిరిగారు.



భక్తులు కొండపైకి వెళ్లకుండా పోలీసు బందోబస్తు



హనుమాన్ విగ్రహానికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

'సంక్షేమాన్ని విస్మరించారు'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలపై తీవ్ర వ్యతిరేకత వస్తోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్.. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తుంటే.. రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్ పద్దుల కోసం ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టి తమ దివాలా కోరుతనం ప్రదర్శించాయని విమర్శించారు. స్థానిక ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేశామన్నారు. తమ ఎనిమిదేళ్ల పాలనలో ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమీలేదని దుయ్యబట్టారు. గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించే ఉపాధిహామీ పథకానికి నిధులు తగ్గించడం పేదలపై బీజేపీ ప్రభుత్వానికి ఉన్న వివక్షకు నిదర్శనమన్నారు. బీజేపీని తలదన్నేలా ప్రచార ఆర్భాటాలకు పోతున్న కేసీఆర్ ప్రభుత్వం.. ధనిక రాష్ట్రం తెలంగాణను అప్పులకుప్పగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022–23 బడ్జెట్‌లో దళితబంధు కోసం రూ.17,700కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఒక్కరూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. అవే నిధులను 2023–24బడ్జెట్‌కు కేటాయించారని ఆరోపించారు. 2022–23లో ఎంతమందికి దళితబంధు విడుదల చేశారో మంత్రి ఈశ్వర్ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, ఆర్గనైజింగ్ కార్యదర్శి బండ శంకర్, బల్దియా ఫ్లోర్‌లీడర్ కళ్లెపెల్లి దుర్గయ్య, కౌన్సిలర్ నక్క జీవన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, నాయకులు ముంజాల రఘువీర్, గుండ మధు, నేహాల్, చందా రాధాకిషన్, చాంద్‌పాషా ఉన్నారు.

అమర జవాన్లకు అశ్రునివాళి



నివాళి అర్పిస్తున్న యువకులు

మల్లాపూర్(కోరుట్ల): కుస్తాపూర్ గ్రామంలో పలువురు యువకులు అమరజవాన్లకు కొవ్వొత్తులతో అశ్రునివాళి అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సరికెల లక్ష్మీమహిపాల్, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై మేధావుల సదస్సు

కోరుట్ల: స్థానిక సీఎంఎస్ గార్డెన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై బుధవారం మేధావుల సదస్సు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలోని అన్నివర్గాల సంక్షేమం కోసం ఎంతోఉపయోగ పడుతుందన్నారు. పట్టణానికి చెందిన డాక్టర్ ప్రభాకర్, మంచాల జగన్, ఉపాధ్యాయులు రవికుమార్, రాజేశ్, శ్రీనివాస్, న్యాయవాదులు బోయిని వేణు, శ్రీనివాస్, నరేందర్, రాములు బడ్జెట్‌పై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

నల్లని చారు.. ఉడకని అన్నం

- కేజీబీవీలో భోజనం తీరు
- బాలికల అస్వస్థతపై విచారణ





నల్లరంగులో ఉన్న అన్నం, చారు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 13 మంది బాలికలు మంగళవారం సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఫుడ్ పాయిజన్‌తోనే విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తోటి విద్యార్థులు చెబుతున్నారు. వీరు ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం వారి ఆరోగ్య పరిస్థితి మరింత మెరుగుపడిందని వైద్యులు తెలిపారు. అయితే, ఆహారం వికటించడానికి కారణం ఏమిటి, నిర్వాహకులు భోజనం సక్రమంగా పెట్టడం లేదా? అనే కోణాల్లో అధికారులు విచారణ జరుపుతున్నారు.

రంగంలోకి దిగిన డీఈవో..

- డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పాఠశాలకు చేరుకుని ఘటనపై విచారణ చేపట్టారు.
- భోజనం ఎలా ఉందని ప్రతీ విద్యార్థిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.
- తమకు నాణ్యమైన, పూర్తిస్థాయిలో భోజనం పెట్టడంలేదని పలువురు బాలికలు ఆయనతో చెప్పినట్లు తెలిసింది.
- నల్లరంగులోని నీళ్లచారు, పప్పు, ఉడికీఉడకని అన్నంతో భోజనం చేయలేకపోతున్నామని డీఈవో ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది.
- ప్రతీ విద్యార్థిని డీఈవో పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బయటి భోజనమే కారణమా..

కస్తూరిబా పాఠశాలలో ఉడికీఉడకని అన్నం, నల్లని నీళ్లచారుతో రెండురోజుల క్రితం చేసిన ఇడ్లీ, సాంబారు పెట్టడంతోనే వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి వచ్చిందని పలువురు విద్యార్థినులు ఆవేదనతో చెప్పారు. కానీ, అదేరోజు ఓ వివాహ కార్యక్రమానికి చెందిన వారు విద్యార్థినుల కోసం భోజనం తెచ్చి ఇచ్చారని, ఆ భోజనం చేసిన బాలికలు అస్వస్థతకు గురయ్యారని సమాచారం. బయటి భోజనం కేజీబీవీలోకి తీసుకురావడానికి వీలులేదు. అధికారులు ఆ కోణంలోనూ వివరాలు సేకరిస్తున్నారు.

బయటకు పొక్కకుండా జాగ్రత్తలు..

బాలికలు అస్వస్థతకు గురైన విషయాన్ని బయటకు పొక్కకుండా అధ్యాపకులు ప్రయత్నించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఎంఈవోకు తెలుపగా ఆయన వచ్చి వెళ్లి బాలకలను ఆస్పత్రికి పంపించారు. ఒకదశలో ఎంఈవోను సైతం లోపలికి రానివ్వకుండా అడ్డుకున్నట్లు తెలిసింది.

తల్లిదండ్రుల్లో ఆందోళన..

ఒకేసారి 13 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. రాత్రి కావడంతో ఫోన్ల ద్వారా సమాచారం తెలుసుకుని బుధవారం ఉదయమే ఆస్పత్రికి చేరుకున్న తల్లిదండ్రులు.. తమ పిల్లల యోగక్షేమాలు అడిగి తెలుసుకుని యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

విచారణ అనంతరం చర్యలు



కస్తూరిబా గాంధీ బాలిల విద్యాలయంలో జరిగిన ఘటనపై విచారణ చేపట్టాం. బాలికలకు భోజనం సరిగా పెట్టడం లేదని పేర్కొన్నారు. బయటి నుంచి వచ్చిన ఫుడ్ ఎలా అనుమతించారనే విషయంపైనా విచారణ జరుపుతున్నాం. విచారణ పూర్తయ్యాక తదుపరి చర్యలు తీసుకుంటాం.

– జగన్‌మోహన్‌రెడ్డి, డీఈవో

గల్ఫ్ ట్రావెల్స్‌పై నిఘా కరువు!

- ఉద్యోగాల పేరిట నకిలీల రంగ ప్రవేశం
- నిరుద్యోగులను మోసం చేస్తున్న వైనం

> జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఉన్న ఊరులో ఉపాధి కరువై పొట్టచేత పట్టుకుని విదేశాలకు వెళ్లేందుకు యత్నించాడు. ఈక్రమంలో మల్యాల మండలం లంబాడిపల్లికి చెందిన ఓ వ్యక్తి కెనడాకు పంపిస్తామని చెప్పి ఆ యువకుడికి ఆశ చూపాడు. అతడితోపాటు జగిత్యాల, పోరుమల్ల గ్రామాలకు చెందిన మరికొందరి నుంచి రూ.50వేల చొప్పున వసూలు చేశాడు. ఆ తర్వాత పత్తాలేకుండాపోయాడు.

> జగిత్యాల సమీప టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన హన్మండ్లు ఆటో నడుపుతూ బతుకుతున్నాడు. కుటుంబ పోషణ భారం కావడంతో గల్ఫ్ వెళ్లేందుకు ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని సంప్రదించాడు. ఇజ్రాయిల్ పంపిస్తానని చెప్పిన ఆ వ్యక్తి హన్మండ్లు నుంచి రూ.2.50 లక్షలు తీసుకుని ఇప్పటికీ పంపించడంలేదు.

జగిత్యాలక్రైం: ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే వారి సంఖ్య జిల్లాలో రోజురోజుకూ పెరిగిపోతూనే ఉంది. దీనిని ఆసరాగా తీసుకుంటున్న కొందరు ట్రావెల్స్, గల్ఫ్ ఏజెంట్లు.. నిరుద్యోగుల నుంచి అందినకాడికి దండుకుంటూ మోసం చేస్తున్నారు. మరీముఖ్యంగా రెండేళ్లుగా వీరి ఆగడాలు హద్దు మీరడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

అనుమతిలేని ట్రావెల్స్ 150..

- జిల్లాలో సుమారు 150 ట్రావెల్స్‌లు అనధికారికంగా నడుస్తున్నాయని జిల్లాస్థాయి అధికారులు గుర్తించారు.



ఇంటర్వ్యూకు హాజరైన నిరుద్యోగులు(ఫైల్)

- గ్రామాలేకాదు.. పట్టణాల్లోని నిరుద్యోగులకు విదేశీల్లో ఉపాధి కల్పిస్తామని నమ్మిస్తూ కొందరు ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్నారు.
- జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాల తోపాటు 20 మండలాల్లో గల్ఫ్ ట్రావెల్స్ పేరిట ట్రావెల్స్ నిర్వహిస్తున్నారు.
- వాస్తవానికి విమాన టికెట్లు బుక్ చేసేందుకు అనుమతి తీసుకుని నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని ఆశ చూపుతున్నారు.
- పాస్‌పోర్టులు తీసుకొని ఇంటర్వ్యూలకు హాజరు పరుస్తున్నారు.
- ఆ తర్వాత వీసా వచ్చిందని నమ్మిస్తూ రూ.లక్షలు వసూలు చేస్తున్నారు.
- అనుమతి లేకుండా మనీ ట్రాన్స్‌ఫర్ కేంద్రాలు కూడా నిర్వహిస్తున్నారు.
- ఉపాధి దొరికితే చాలు అనే ఆశతో నిరుద్యోగులు నిర్వాహకుల చేతిలో రూ.లక్షలు పెట్టి మోసపోతున్నారు.

18 మందికే లైసెన్స్‌లు

జిల్లాలో కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ నుంచి కేవలం 18 మంది ఏజెంట్లకే లైసెన్స్‌లు ఉన్నాయి. మిగతావారు అనుమతి లేకుండా ట్రావెల్స్ నిర్వాహకులుగా, ఏజెంట్లుగా చలామణి అవుతున్నారు.

యూరప్‌కు కూడా ఇంటర్వ్యూలు..

గతంలో లైసెన్స్‌ఉన్న ట్రావెల్స్ యజమానులు గల్ఫ్‌కు యువతను పంపించేవారు. ప్రస్తుతం లైసెన్స్‌లు ఉన్నవారు, లేనివారు యూరప్ దేశాల్లో నూ ఉద్యోగాలు ఉన్నాయని చెబుతూ, ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.2లక్షల –రూ.5 లక్షల వరకు వసూలు చేసి అక్కడకు పంపిస్తున్నారు. అంతేకాదు.. వీసా వచ్చిందని, వైద్య పరీక్షలు చేయాలని కూడా అందినకాడికి దోచుకుంటున్నారు. పోలీసుల నిఘా కరువడంతో నకిలీలు ఆడిందే ఆటగా సాగుతోంది.

గుట్టగా ఇంటర్వ్యూలు..

- లైసెన్స్‌గల గల్ఫ్ ఏజెంట్లు, ట్రావెల్స్ నిర్వాహకులు ఎస్పీ పోలీసులకు ముందుగా సమాచారం అందించి ఇంటర్వ్యూలు నిర్వహించాలి.
- కానీ చాలామంది సమాచారం ఇవ్వకుండానే.. అదికూడా జిల్లా కేంద్రంలోనే ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు.
- ఇందుకోసం హైదరాబాద్, ముంబాయ్, చెన్నై, ఢిల్లీలోని ట్రావెల్స్ యజమానులతో ఒప్పందం కుదర్చుకుంటున్నారు.
- ఇంటర్వ్యూలకు పిలిపించిన వారినుంచి పాస్‌పోర్టులు తీసుకొని.. ఇంటర్వ్యూల్లో అర్హత సాధించారని చెప్పి పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకుంటున్నారు.
- ఆ తర్వాత ఏదో ఒకవీసా అప్పగించి మోసం చేస్తున్నారు.

మోసం చేస్తే కఠిన చర్యలు

గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు నకిలీ ఏజెంట్లను ఆశ్రయించొద్దు. ఎమిగ్రేషన్, చట్టబద్ధత ఉన్న వారి నుంచే వీసాలు తీసుకోవాలి. నిబంధనలు ఉల్లంఘించి మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపడతాం. ఎవరైనా నకిలీ ఏజెంట్లు మోసం చేస్తే బాధితులు ఫిర్యాదు చేయండి. నిందితులపై కేసులు నమోదు చేస్తాం.

– భాస్కర్, ఎస్పీ

క్లుప్తంగా

కాంగ్రెస్, బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్


అరెస్టయిన బీజేపీ నాయకులు

జగిత్యాలక్రైం: సీఎం కేసీఆర్ కొండగట్టు పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మంగళవారం రాత్రి జిల్లాలోని కాంగ్రెస్, బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. పోలీసుస్టేషన్లలో ఉంచి ముఖ్యమంత్రి పర్యటన ముగియగానే నాయకులను వదిలిపెట్టారు.

వ్యక్తి అదృశ్యం

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని అరవింద్‌నగర్‌కు చెందిన గంప శ్రీనివాస్ అదృశ్యమైనట్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదు చేశారు. గంప శ్రీనివాస్ కొంత కాలంగా అప్పులు ఎక్కువ కావడంతో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కిశోర్ తెలిపారు.

రెండు ఆలయాల్లో దొంగతనం

మెట్‌పల్లి(కోరుట్ల): జగ్గాసాగర్‌లోని రెండు ఆలయాల్లో దొంగతనం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు బ్రహ్మంగారి ఆలయంలోకి చొరవబడి హుండీ పగులగొట్టారు. రామాలయంలోని హుండీని ఎత్తుకెళ్లారు. వాటిల్లో సుమారు రూ.80 వేల నగదు ఉన్నట్లు తెలిపారు. ఆలయాలను పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరు!

- లైన్ల మరమ్మతుపై ట్రాన్స్‌కో నిర్లక్ష్యం
- మరమ్మతు కోసం చెప్పినా ఫలితం లేదు

‘సుమారు ఏడాదిన్నర క్రితం.. సారు మా ఊళ్లో కరెంటు తీగలు వేలాడుతున్నాయి.. తెగిపోతయ్ కావచ్చు.. కొంచెం మరమ్మతు చేయండని గ్రామస్తులు ఆరు నెలలుగా మొరపెట్టుకున్నా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోలేదు. ఫలితంగా ఇంటి ఎదుట కరెంటు తీగలు తెగిపడి అందుగుల మల్లయ్య (65)తో పాటు మనమరాలు మౌనిక(14) అక్కడిక్కడే మృతి చెందారు.

సుమారు ఆరు నెలల క్రితం సంగెం గ్రామంలోని పొలంలో గడ్డి కోసేందుకు వెళ్లిన ఓ యువకుడు(26) విద్యుత్ స్తంభం వద్ద తెగిఉన్న వైరు తగిలి అక్కడిక్కడే ప్రాణాలు వదిలాడు.

బుధవారం యూసుఫ్‌నగర్ శివాలయం ఏరియాలోని పొలాల సమీపంలో కరెంట్ మెయిన్ వైర్ తెగిందని ఉదయం 9 గంటలకు పలువురు గ్రామస్తులు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించారు. అయినా ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు. ఫలితంగా అనపకాయ తెంపేందుకు తోటకు వెళ్లిన ఈశ్వరమ్మ కరెంటు మెయిన్ వైర్ తగిలి కాలిబూడిద అయ్యింది.’

కోరుట్ల: పట్టణంలోని హాజీపురా, గాంధీరోడ్డు, మెయిన్‌రోడ్డు, ముత్యాలవాడ ఏరియా తదితర చోట్ల దెబ్బతిన్న, వేలాడే విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. గాలిదుమారం వచ్చిన సందర్భాల్లో అవి తెగిపోతాయని జనం ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇదేరీతిలో గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాల్లో కరెంటు మోటార్లకు అనుసంధానంగా ఉండే విద్యుత్ తీగలు, మెయిన్‌లైన్లు చాలా చోట్ల దెబ్బతింటున్నాయి. వీటికి మరమ్మతు చేయాలని విన్నవించినా ట్రాన్స్‌కో సిబ్బంది సకాలంలో స్పందించకపోవడంతో గేదెలు, గొర్రెలు విద్యుదాఘాతంతో మృతి చెందుతున్నాయి. ఒక్కోసారి ట్రాన్స్‌కో నిర్లక్ష్యం మనుషులకు ప్రాణాంతకంగా మారుతోంది.


యూసుఫ్‌నగర్‌లో తెగిపడిన మెయిన్‌లైన్ వైర్


ఎఖీన్‌పూర్‌లో ప్రాణాలు కోల్పోయిన తాత మనుమరాలు(ఫైల్)

ఫిర్యాదులు చేసినా..!

- కరెంటు తీగలు తెగిపడ్డాయని గ్రామస్తులు, రైతులు ఫిర్యాదులు చేసినా ట్రాన్స్ సిబ్బంది సకాలంలో స్పందించడం లేదు.
- యూసుఫ్‌నగర్ గ్రామస్తులు బుధవారం ఉదయం 9 గంటల సమయంలోనే శివాలయం వద్ద మెయిన్‌లైన్ తెగిపడి ఉందని, బాగు చేయాలని లైన్‌మెన్‌తో పాటు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించారు.
- అయినా, ఎవరూ పట్టించుకోలేదు. మోటార్లు పనిచేయడం లేదని, ఎక్కడో వైర్ తెగి ఉంటుందని చెప్పినా నిర్లక్ష్యం చేశారు.
- ఫలితంగా ఉదయం 9.30 గంటల సమయంలో తోటలో అనపకాయ తెంపేందుకు వెళ్లిన ఈశ్వరమ్మ మధ్యాహ్నం 12 గంటల సమయంలో కరెంటు వైర్లు తగిలి ప్రాణాలు కోల్పోయింది.

విద్యుత్ సరాఫరా నిలిపివేశాం

యూసుఫ్‌నగర్ శివాలయం సమీపంలో మెయిన్‌లైన్ తెగిందని మధ్యాహ్నం 12.45 గంటలకు సమాచారం అందింది. వెంటనే సిబ్బందికి చెప్పి విద్యుత్ సరాఫరా నిలిపివేయించాం. అంతలోపే అనూహ్య సంఘటన చోటుచేసుకుంది.

– అంజన్‌రావు, ఏడీఈ, కోరుట్ల

కరెంటు షాక్‌తో కాలి పోయింది..!



ఈశ్వరమ్మ మృతదేహం(ఇన్‌సెట్లో ఈశ్వరమ్మ(ఫైల్), ట్రాక్టర్‌లో శవం ఉంచి ధర్నా చేస్తున్న గ్రామస్తులు

కోరుట్ల/కోరుట్లరూరల్: మెయిన్ వైర్లు తెగి విద్యుత్ షాక్ తగలడంతో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. కాలి బొగ్గుగా మారిన సంఘటన యూసుఫ్‌నగర్‌లో బుధవారం చోటుచేసుకుంది. యూసుఫ్‌నగర్ శివారు శివాలయం సమీపంలోని తమ అనపకాయ తోటకు పంతంగి ఈశ్వరమ్మ(51) ఉదయం 9 గంటలకు వెళ్లింది. తోటలో పని చేసుకుంటుండగా 11 గంటల సమయంలో తెగిన మెయిన్ విద్యుత్ వైర్ ఆమెకు తగిలింది. దీంతో షాక్‌కు గురైన ఈశ్వరమ్మ కాలిపోయి బొగ్గుగా మారి అక్కడిక్కడే మృతి చెందింది. తోటలో మంటలు వచ్చిన విషయాన్ని గమనించిన ఉప సర్పంచ్ ఆరె రాజం.. ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు విద్యుత్ సరాఫరా నిలిపేశారు. ఈశ్వరమ్మ భర్త ఏడాది క్రితం అనారోగ్యంతో చనిపోగా ఇద్దరు కుమారులు ఉన్నారు.

శవంతో సబ్‌స్టేషన్ వద్ద ధర్నా

ట్రాన్స్‌కో అధికారులకు విద్యుత్ వైర్లు తెగిఉన్నాయని సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోలేదని గ్రామస్తులు కోరుట్ల–మెట్‌పల్లి జాతీయ రహదారి వెంట ఉన్న 133/13కేవీ సబ్‌స్టేషన్ వద్ద సుమారు గంటన్నర పాటు ధర్నా చేశారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని నాయకులు లింబాద్రి, తుల ఉమ, నవీన్‌రావు డిమాండ్ చేశారు. సీఐ రాజశేఖర్‌రాజు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

అవ్వా నీ ఆరోగ్యం జాగ్రత్త అని..

- సౌదీలో గుండెపోటుతో ధర్మపురి వాసి హఠాన్మరణం


శ్రీనివాస్

ధర్మపురి: తన తల్లి ఆరోగ్యం గురించి జాగ్రత్తలు చెప్పిన గల్ఫ్ వలస జీవి.. గుండెపోటుతో హఠాన్మరణం చెందడం ఆ కుటుంబంలో విషాదం నింపింది. జగిత్యాల జిల్లా ధర్మపురిలోని తోట్లవాడకు చెందిన వొజ్జల శ్రీనివాస్(50) ఉపాధి కోసం కొన్నేళ్లుగా సౌదీ వెళ్లి వస్తున్నాడు. తన తల్లి సత్తవ్వ ఆరోగ్యం బాగోలేదని తెలిసి రెండునెలల క్రితం ధర్మపురి వచ్చాడు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తల్లికి ఆపరేషన్ చేయించాడు. ఆ తర్వాత మళ్లీ సౌదీ వెళ్లాడు. అప్పటి నుంచి రోజూ భార్యాపిల్లలతో ఫోన్‌లో మాట్లాడుతూ, తల్లి ఆరోగ్యంపై ఆరా తీస్తూనే ఉన్నాడు. అయితే, ఈనెల 14న ఉదయం విధులకు వెళ్తుండగా మార్గమధ్యంలో గుండెపోటుకు గురై హఠాత్తుగా కిందపడిపోయాడు. స్థానికులు, స్నేహితులు గుర్తించి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందాడు. స్నేహితులు ఈ విషయాన్ని మృతుడి కుటుంబసభ్యులకు కాకుండా బంధువులకు చేరవేశారు.

అనేక మందికి ఉపాధి కల్పించిన శ్రీనివాస్

శ్రీనివాస్ సౌదీలో తనకున్న పరిచయాలతో చాలామంది స్నేహితులకు వీసాలు పంపించి జీవనోపాధి కల్పించారు. అందరితో కలిసిమెలిసి ఉంటున్న శ్రీనివాస్ అకాలమరణం తీరని లోటు అని స్థానికులు కంటతడి పెట్టారు. శ్రీనివాస్‌కు భార్య పద్మ, కవల కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెళ్లీడుకు వచ్చిన కూతుర్లు బీటెక్ చదువుతుండగా కుమారుడు పదో తరగతి చదువుతున్నాడు. ప్రతిరోజూ నాన్నతో ముద్దుముద్దు మాటలు మాట్లాడే పిల్లలు, క్షేమసమాచారం తెలుసుకునే భార్యకు ఈవిషయం ఇంకా తెలియనివ్వడంలేదు. మృతదేహం రాకకోసం బంధువులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

అట్టహాసంగా ‘మానేరు’ వార్షికోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొడిమ్యాల(చొప్పదండి): కొడిమ్యాల మండలం పూడూరులోని మానేరు ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జబర్దస్త్ టీం సభ్యులు సద్దాం హుస్సేన్, భాస్కర్, సందీప్, మానేరు విద్యా సంస్థల అధినేత కదారి అనంతరెడ్డిలు జ్యోతిప్రజ్వలన చేసి వేడకలు ప్రారంభించారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించి విద్యాసంస్థకు, తల్లిదండ్రులకు, జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీలతో పాటు పలు ఒలింపియాడ్‌లో విజేతలుగా నిలిచిన వారికి ట్రోఫీలు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో జగన్మోహన్‌రెడ్డి, ఎంపీపీ స్వర్ణలత రాజనర్సింగరావు, జెడ్పీటీసీ ప్రశాంతి కృష్ణారావు, సర్పంచ్ కవిత రవికుమార్, ఉప సర్పంచ్ లింగారెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌తో పాటు మానేరు విద్యాసంస్థల డైరెక్టర్లు సునీతారెడ్డి, కృష్ణారెడ్డి, శ్వేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జబర్దస్త్ టీం సభ్యులు సద్దాం హుస్సేన్, భాస్కర్, సందీప్‌లు చేసిన కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

తృటిలో తప్పిన ప్రమాదం

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రం శివారులోని రైస్ మిల్ ఆవరణలో బుధవారం రుద్రంగి నుంచి మానాలకు వెళ్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. పక్కనే ఉన్న మట్టిలో దిగబడి ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. సమీపంలోని శివస్వాములు కారును రోడ్డు పైకి లాగారు.


అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు

నేత్ర శస్త్ర చికిత్సకు మోక్షమెప్పుడో..?

- జిల్లా ఆస్పత్రిలో అందుబాటులోకి రాని ప్రత్యేక గదులు
- ముగ్గురు నేత్ర వైద్య నిపుణులున్నా అందని సేవలు
- కంటి వెలుగులో పరీక్షలు మాత్రమే
- ప్రైవేటు ఆస్పత్రులే దిక్కు

జగిత్యాల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించాలని ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటు కావడంతో ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి జనరల్ ఆస్పత్రిగా మారింది. కార్పొరేట్ వైద్యం అందుతుందని భావించినప్పటికీ పేద ప్రజలకు మాత్రం నేత్ర వైద్య సేవలు అందుబాటులోకి రావడం లేదు. అన్ని విభాగాలు అందుబాటులో ఉన్నా అతి ముఖ్యమైన నేత్రవైద్య సేవలు అందుబాటులోకి రాకపోవడంతో ఇబ్బందికరంగా మారింది.

ముగ్గురు నేత్ర వైద్య నిపుణులున్నా..

జిల్లా కేంద్రం కాక ముందు ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక్కరే నేత్ర వైద్య నిపుణుడు ఉండేది. మెడికల్ కళాశాల ఏర్పాటుతో మరో ఇద్దరు వైద్య నిపుణులు వచ్చారు. అయినా పేద వారికి శస్త్ర చికిత్సలు అందడం లేదు. జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేకమైన గది లేకపోవడం, మాతా శిశు సంక్షేమ కేంద్రం ప్రారంభమైన తర్వాత పాతబస్టాండ్‌లో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో సీమాంక్ కేంద్రాన్ని అక్కడకు తరలించారు. సీమాంక్ కేంద్రంలో నేత్ర వైద్య ప్రత్యేక గది ఏర్పాటుకు అవసరమైన సామగ్రి కోసం ప్రతిపాదనలు రూపొందించగా, అమలులోనే ఉంది. 2015లో సైతం కంటి వెలుగు కార్యక్రమం సందర్భంగా ప్రత్యేక గదితో పాటు పరికరాలు అందుబాటులోకి తేవాలని వైద్యాధికారులు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. మరో విడత కంటి వెలుగు ప్రారంభం అయినా శస్త్ర చికిత్సలు చేయకపోవడంతో ఉత్త పరీక్షలు మాత్రమే చేస్తున్నారు.


కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ప్రతిపాదనల్లోనే గది

జగిత్యాలలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ముగ్గురు నేత్ర వైద్యులను నియమించినా నేత్ర శస్త్ర చికిత్సకు అవసరమైన గదులు లేవు. సిమాంక్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసేలా ప్రయత్నం చేసినప్పటికీ కొన్ని నెలలుగా చేస్తున్న రెనోవేషన్ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.

కంటి వెలుగులో శస్త్ర చికిత్సలెక్కడ?

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగులో ఎవరికైనా శస్త్ర చికిత్సలు అవసరముంటే రాసుకుంటున్నారే తప్ప చికిత్సలకు ఆస్పత్రికి మాత్రం పంపించడం లేదు. రీడింగ్ చూడటం, అద్దాలు ఇవ్వడమే జరుగుతోంది. శస్త్ర చికిత్సలు మాత్రం చేయడం లేదు.

ప్రైవేటు ఆస్పత్రులే దిక్కు

జిల్లాలో పేద మహిళలు, వృద్ధులు నేత్ర సమస్యలతో అధికంగా బాధపడుతున్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే వారు పరీక్ష చేసి కరీంనగర్‌కు రెఫర్ చేస్తున్నారు. ప్రత్యేక గదులు లేకపోవడం, ఆపరేషన్లకు అవసరమైన వైద్య పరికరాలు లేక ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రైవేటులో అత్యధికంగా ఫీజులుండటంతో జంకుతున్నారు.

ప్రత్యేక గది అందుబాటులోకి తేవాలి

జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక గది అందుబాటులోకి తేవాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రైవేటుకు వెళ్తే ఆర్థికంగా చితికిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ ఫీజు రూ.300 నుంచి రూ.400 ఉండగా శస్త్ర చికిత్స చేయించుకుంటే రూ.20 నుంచి రూ.30 వేల ఖర్చు అవుతుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో కంటి శస్త్ర చికిత్సలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ ఆస్పత్రిలోని మొదటి అంతస్తులో నేత్ర శస్త్ర చికిత్స కోసం ప్రత్యేకంగా గదులు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నాం. కొద్దిపాటి రెనోవేషన్ సైతం జరిగింది. ప్రస్తుతం ఆస్పత్రిలో కంటి పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నాం. త్వరలోనే శస్త్ర చికిత్సలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– రాములు, ఆస్పత్రి సూపరింటెండెంట్

జిల్లా పోలీసు అధికారుల ఫోన్‌నంబర్ల మార్పు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసు అధికారుల అధికారిక ఫోన్ నంబర్లు మార్పు చేవారు. కొత్త సెల్‌ఫోన్ నంబర్లు గురువారం నుంచి పనిచేయనున్నాయి.

జగిత్యాల జిల్లా ఎస్పీ	8712656800	కొడిమ్యాల ఎస్సై	8712656831
అడిషనల్ ఎస్పీ	8712656801	మల్యాల ఎస్సై	8712656830
జగిత్యాల డీఎస్పీ	8712656802	పెగడపల్లి ఎస్సై	8712656832
మెట్‌పల్లి డీఎస్పీ	8712656803	గొల్లపల్లి ఎస్సై	8712656826
స్పెషల్ బ్రాంచ్‌డీఎస్పీ	8712656804	వెల్గటూర్ ఎస్సై	8712656827
స్పెషల్ బ్రాంచ్		ధర్మపురి ఎస్సై	8712656824
ఇన్‌స్పెక్టర్	8712656807	బుగ్గారం ఎస్సై	8712656829
సీసీఎస్ సీఐ	8712656810	సారంగాపూర్ ఎస్సై	8712656825
జగిత్యాల టౌన్ సీఐ	8712656815	బీర్పూర్ ఎస్సై	8712656828
జగిత్యాల రూరల్ సీఐ	8712656816	రాయికల్ ఎస్సై	8712656791
మల్యాల సీఐ	8712656818	మేడిపల్లి ఎస్సై	8712656792
ధర్మపురి సీఐ	8712656817	కోరుట్ల ఎస్సై	8712656790
కోరుట్ల సీఐ	8712656820	కథలాపూర్ ఎస్సై	8712656793
మెట్‌పల్లి సీఐ	8712656819	మెట్పల్లి ఎస్సై	8712656794
జగిత్యాలరూరల్‌ఎస్సై	8712656822	ఇబ్రహీంపట్నం ఎస్సై	8712656795
జగిత్యాలట్రాఫిక్‌ఎస్సై	8712656823	మల్లాపూర్ ఎస్సై	8712656796

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి చెందిన సంకు లక్ష్మణ్, ప్రేమ్‌సాగర్ బొలేరో వాహనంలో బుధవారం తెల్లవారు జామున రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా, పక్కా సమాచారంతో పోలీస్‌స్టేషన్ వద్ద పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

జగిత్యాల జిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మెట్‌పల్లిలో మౌనిక ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా.. ఎండపల్లి మండలంలో మాచర్ల సరిత, భీమారం మండలం మన్నెగూడెంలో వద్లకొండ హారిక, కొత్తపేటలో వృద్ధుడు కొండయ్య ఆత్మహత్య చేసుకున్నారు.

మెట్‌పల్లిలో ఉరేసుకొని యువతి.

మెట్‌పల్లి: పట్టణంలోని సాయిరాంకాలనీకి చెందిన మౌనిక(22) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మౌనికకు ఏడాది క్రితం హైదరాబాద్‌కు చెందిన యువకుడితో వివాహం కుదిరింది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వివాహం జాప్యం జరుగుతుండటంతో మానసికంగా కృంగిపోతోంది. ఈక్రమంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాజారాంపల్లిలో బావిలో దూకి..

వెల్గటూర్(ధర్మపురి): ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో మాచర్ల సరిత (21) బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాచర్ల సరిత మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో యువతి తండ్రి చంద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో వారి వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. అయితే మంగళవారమే బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. మృతురాలి తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. యువతి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.


సరిత మృతదేహం

మన్నెగూడెంలో జీవితంపై విరక్తి చెంది..

మేడిపెల్లి(కోరుట్ల): భీమారం మండలం మన్నెగూడెంకు చెందిన వద్లకొండ హారిక (21) అనారోగ్య కారణాలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్సై హసన్ మహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. హారిక నాలుగేళ్లుగా ఫిట్స్‌వ్యాధితో పాటు కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ పడుకున్న తర్వాత చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు కోరుట్లలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. మృతురాలి తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.


కొండయ్య మృతదేహం

క్రిమిసంహారక మందుతాగి వ్యక్తి ..

వెల్గటూర్(ధర్మపురి): ఎండపల్లి మండలం కొత్తపేటలో బుధవారం మోకాళ్ల నొప్పుల బాధ భరించలేక క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి ఆత్యహత్యాకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటకు చెందిన తరాల్ల కొండయ్య (55) ఇరవై ఏళ్లుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్నాడు. తన దీనావస్థను తలచుకుంటూ నిత్యం బాధపడేవాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ పడుకున్న సమయంలో క్రిమిసంహారక మందు తాగి వాంతులు చేసుకుంటుండగా గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాళ్ల నొప్పులు భరించలేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి కొడుకు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు.

ఇద్దరి బైండోవర్

వీర్నపల్లి(సిరిసిల్ల): నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం అమ్మకాలు జరుపుతున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసి తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. వీర్నపల్లి బావోజి తండా, బంజేరు, గోలియా నాయక్ తండా, మద్దిమల్లలో ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది దాడులు నిర్వహించగా ఇద్దరు పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. పట్టుబడిన వ్యక్తులు భవిష్యత్తులో ఎలాంటి ఎక్సైజ్ నేరానికి పాల్పడమని తహసీల్దార్‌కు హామీ పత్రం రాసిచ్చారన్నారు.

